

## దేవాలయాల నిర్మాణాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/ రాంచంద్రపురం :** నియోజకవర్గంలోని దేవాలయాల నిర్మాణాలకు అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నమని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్పూర్ డివిజన్ పరిదిలోని గండి గూడెంలో గల శ్రీకాశీ విశ్వనాథ అభయాంజనేయ స్వామి దేవాలయం పదవ వార్సికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల కళ్యాణంలో పాల్గొన్నారు. భగవంతుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపిపి దేవానందం ,మాజీ జడ్పీటిసి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న కల్యాణానికి ఎంపిడిఒ,ఎస్ఐ

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలం పరిధిలోని నందగోకుల్ గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న కల్యాణ మహోత్సవం పండుగ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకలలో ఎంపిడిఒ రాజీరెడ్డి, ఎస్ఐ రాజేష్, సర్పంచ్ భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు కృష్ణ యాదవ్, యాదయ్య యాదవ్, రాజయ్య యాదవ్, కార్తీక్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, శ్రీశైలం యాదవ్, లక్ష్మణ్ యాదవ్, రమేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## పోరాడి పెన్షన్ సాధించుకుందాం

**ప్రజాపక్షం/టేక్మాల్ :** వికలాంగులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన పెన్షన్ పెంపును పోరాడి సాధించుకుందామని ఎన్పీఆర్‌డి మెదక్ జిల్లా కార్యదర్శి కె.యశోద పిలుపునిచ్చారు. సోమవారం టేమవారం మండల పరిధిలోని కాద్లూర్ గ్రామంలో జరిగిన వికలాంగుల సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. అధికారంలోకి రావడానికి ముందు కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు రూ.6,000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం మాట నిలబెట్టుకునేలా పోరాటం చేయాలని వికలాంగులను కోరారు.

**మార్చి 13న నిరాహార దీక్షలు :** వికలాంగుల పెన్షన్‌తో పాటు చేయూత పెన్షన్ పెంపు కోసం మార్చి 13న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సామూహిక నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు ఎన్పీఆర్‌డి జిల్లా కార్యదర్శి కే.యశోద, ఉపాధ్యక్షుడు టి.యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా మండలం కాదులూరు గ్రామంలో ఎన్పీఆర్‌డి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రమ్మ, కేశమ్మ, ఎల్లమ్మ, రమేష్, మల్లయ్య, కిష్టయ్య, చిన్న నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన : కౌన్సిలర్ అంతిరెడ్డి

**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కృషితో నిర్మాణ ఎన్జీఓ సంస్థ ఆధ్వర్యంలో రామేశ్వరం బండ వీకర్ సెక్షన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సిస్ఆర్ నిదుల ద్వారా నాలుగు నూతన తరగతి గదుల నిర్మాణం , ఇతర మౌళిక సదుపాయాల కల్పనకు గాను భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ భూమి పూజ కార్యక్రమం స్థానిక కౌన్సిలర్ అంతిరెడ్డి చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాణ సంస్థ డైరెక్టర్ శ్రీ శశిదర్ శ్రీ సురేష్ పాఠశాల ప్రదానోపాధ్యాయులు శ్రీ విఠల్ రెడ్డి ఉపాధ్యాయులు మంజుల సంధ్య పాల్గొన్నారు. అదే విధంగా మాజీ ఉపసర్పంచ్ నగేష్, మాజీ వార్డు సాయిలు లోకేష్ రాములు సర్దార్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలలో కొత్త తరగతి గదుల నిర్మాణం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించబడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ప్రశ్నిస్తే కేసులు పెట్టడం దారుణం

**ప్రజాపక్షం/శివ్వంపేట :** తమకు జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం దారుణమని బిఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ ఏనుగు సుధాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రామారం నర్సింలు, బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చేగూరి కుమార్‌గౌడ్‌లు అన్నారు. సోమవారం శివ్వంపేటలో వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని సికింద్లాపూర్ గ్రామస్థులు, బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన చేగూరి కుమార్‌గౌడ్‌కు చెందిన సొంత భూమిలో మహిళా సమాఖ్య భవనం నిర్మాణం చేస్తూ అందులో మూడు పిల్లర్లు అక్రమంగా నిర్మాణం చేశారని, ఇదేమి అన్యాయమని తమ పార్టీ నాయకుడు భూమిలో ఎందుకు పిల్లర్లు నిర్మిస్తున్నారని తాజా మాజీ ఉపసర్పంచ్ రామారం నర్సింలు ప్రశ్నించినందుకు అక్రమంగా కేసు నమోదు చేయించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ ఏనుగు సుధాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రామారం నర్సింలు, చేగూరి కుమార్‌గౌడ్, పంచాయతీ వార్డు సభ్యులు అనిత ఆంజనేయులు, చేగూరి రాజేష్‌గౌడ్, నీరుడి శేఖర్, లక్ష్మి కుమార్ గౌడ్, నాయకులు వినోద్‌కుమార్‌గౌడ్, నర్సారెడ్డి కోరుతున్నారు.

## బైంసాలో రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం వద్ద (ఎస్.ఎం.ఏ.ఎం) వ్యవసాయ యాంత్రికరణ పథకం కింద రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆధునిక వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ముధోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు 50 శాతంక సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందజేశారు. బైంసా,కుంటాల,కుభీర్ మండలాలకు చెందిన పలు గ్రామాల రైతులకు స్ప్రే పంపులు,రోటవేటర్లు తదితర ఆధునిక వ్యవసాయ పరికరాలను ఎమ్మెలే చేతుల మీదుగా పంపిణీ చేశారు.వ్యవసాయ యాంత్రికరణ ద్వారా రైతులపై పడుతున్న కార్మిక వ్యయం తగ్గడంతో పాటు సాగు పనులు వేగంగా పూర్తవుతాయని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం,అభివృద్ధి ప్రధాన లక్ష్యమని తెలిపారు.రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా ఉత్పాదకత పెంపొందించుకోవచ్చని సూచించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటే చిన్న,మధ్య తరహా రైతులు కూడా ఆర్థికంగా బలపడతారని ఆయన అన్నారు. ప్రభుత్వం రైతులకు వ్యవసాయ యాంత్రికరణ పరికరాలను సబ్సిడీపై అందిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,వ్యవసాయ శాఖ అధికారులు,రైతులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధి, ప్రజల శ్రేయస్సే ముఖ్యం

ఎమ్మెల్యే రోహిత్ రావు
ఎమ్మెల్సీ అంజిరెడ్డి
మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ పట్టణ అభివృద్ధి, ప్రజల శ్రేయస్సే ముఖ్యంగా పనిచేస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు మున్సిపల్ చట్టం, ఇతర అంశాలపై, పరిపాలనపై అవగాహన పెంచేందుకు ట్రైనింగ్ క్లాసులు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను ఎమ్మెల్యే కోరారు. త్వరలో పట్టణంలో ఎస్టీపి (మురుగునీటి శుద్ధి కర్మాగారం ప్లాంట్) ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేయాలని ఆదేశించారు. సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సోమవారం నూతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్మన్ కానగు రాధిక భూపతి రాజు అధ్యక్షతన, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో జరిగింది. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డిలు హాజరయ్యారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ కౌన్సిలర్లతా పార్టీలకతీతంగా మెదక్ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజల కోసం .. అభివృద్ధి కోసం పనిచేయండి అన్నారు. మెతుకు సీమను ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యత మీదేనన్నారు. మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు ముట్లాడుతూ భగీరథ నీళ్ళు రాకపోతే ట్యాంకర్లల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. ప్రతి కౌన్సిలర్ అభివృద్ధే ధ్యేయ్యంగా పనిచేయాలని సూచించారు. మనకు అండగా ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు ఉంటారని వివరించారు. వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలపై అధికారంతో కాకుండా సేవా భావంతో పనిచేయాలని అన్నారు. బిజెపి, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వేరైనా పట్టణ అభివృద్ధికి కౌన్సిలర్లు అంతా కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్, వెంకటరమణ, శివరామకృష్ణ, శంసున్నిసా బేగం, పల్లె రాణి, గౌస్ ఖురేషి, బట్టి ఉదయ్ కుమార్, దీపక్ కుమార్, సంధ్య, సోహెల్, స్వరూప, లక్ష్మీ స్వరాగిని, మానస, శశాంక్, అఖిల భరత్‌లు తమ వార్డుల్లో ఉన్న నీళ్ల సమస్యలు, విధి దీపాలు, రోడ్లు, కోతులు, కుక్కల బెడద, పరిసరాల పరిశుభ్రత, ఇంటి పన్నుల వసూలు, 99 రోజుల యాక్షన్ ప్లాన్ అంశాలపై సభలో చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ పి.పావీణ్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపచడంతో పాటు పారిశుద్ధ్యం విద్యార్థులకు అందే సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. పావీణ్య అదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇస్నాపూర్ లోని జెడ్పి హైస్కూల్ ,డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మాధ్యాహ్న భోజనం, పారిశుద్ద్యం ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందన్నారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించాలని సూచించారు. హాల్ టికిట్లు అందాయా, అందులో వివరాలు సరిగ్గా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు రివిజన్ చేస్తున్నారా అని ప్రశ్నిస్తూ ఎలాంటి అందోళనకు గురికాకుండా దైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు ప్రోత్సహించారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజన షెడ్యూల్ సరిగా అమలు కావడం లేదని గుర్తించిన కలెక్టర్ సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గుడ్లు అందించడంలేదని గమనించి వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల హెడ్ మాస్టర్ అనుమతి లేకుండా గైర్హాజరు కావడంపై అగ్రహించిన కలెక్టర్ హెచ్‌ఎంకు షోకాజు నోటీసులు జారీ చేయాలని అదేవిధంగా కొంత మంది ఉపాధ్యాయులు గైర్హాజరు కావడంపై ఎంఇఒ వివరణ ఇవ్వాలని, పర్యవేక్షణ లోపించేందుకు ఎంఇఒలకు కూడా షోకాజు నోటీసు ఇవ్వాలని జిల్లా విద్యాదికారి సూచించారు. విదుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్శనలో కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ సుమలత, మున్సిపల్ కమీషనర్ తమసీల్దార్ సంబందిత అదికారులు పాల్గొన్నారు.

## నేడు అల్లాపూర్లో వెంకటేశ్వర కళ్యాణం

**ప్రజాపక్షం/పాపన్నపేట :** మండల వరిధిలోని అబ్లాపూర్ లో మంగళవారం వెంకటేశ్వర స్వామి కళ్యాణం జరుగుతుందని దేవాలయ వ్యవస్థాపకులు నీరుడి నారాయణ తెలిపారు. ఆలయ దశమ వార్షికోత్సవం పురస్కరించుకొని వెంకటేశ్వర స్వామి, శివపార్వతుల కళ్యాణం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవనంద సరస్వతి హాజరు అవుతారని తెలిపారు.భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.



## హిందీ సాహిత్యం సమాజానికి దిక్సూచి

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** హిందీ సాహిత్యం సమాజానికి దిక్సూచి వంటిది అని ప్రొపెసర్ పూనమ్ పారీకర్ అన్నారు. సోమవారం గిరిజన పురుషుల డిగ్రీకళాశాలలో ప్రత్యేక ఉపాన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొపెసర్ పూనమ్ పారీకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రాచీన సాహిత్యంలో విశేష గుర్తింపు పొందిన 'రహీమ్ కే ధోహే' పాఠ్యాంశంపై విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రొపెసర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.ఎం.శివకృష్ణ, హిందీ విభాగం అధ్యక్ష్యురాలు పి.లక్ష్మి ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/పెంచికలపేట్ :** గ్రామాల్లోని యువత క్రీడల్లో ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటుకోవాలని కమ్మర్‌గాం ఉప సర్పంచ్ కుడిమేత తిరుపతి కోరారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట్ మండలంలోని కమ్మర్‌గాం గ్రామ పంచాయతీ పరిధిలో గల గుండెపల్లి హ్యాబిటేషన్‌లో సోమవారం యువకులకు ఆయన వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్న ఉద్దేశంతో ఈ క్రీడా సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** నేటి పోటీ ప్రపంచంలో మారుతున్న కాలానికి అనుగుణంగా యువత వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల ఐటిఐ ప్రాంగణంలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఎటిసి)లో ల్యాబ్‌ను ఎంఎల్ఎ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం జిల్లాలో మంచిర్యాల, నస్పూర్, మందమర్రి, జన్నారం ప్రాంతాల్లో ఎటిసి కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. వృత్తి విద్యలో నైపుణ్యం ఉంటే దేశ విదేశాల్లో అపార అవకాశాలు ఉంటాయని, విద్యార్థులు నైపుణ్యం కోసం 100 శాతం హాజరు కావాలని సూచించారు. ఎంఎల్ఎ ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ టాటా సంస్థ సహకారంతో ఎటిసి కేంద్రాల్లో ఆధునిక యంత్రాలను సమకూర్చినట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి కల్పించడంతో పాటు బ్యాంకు రుణాలు అందిస్తామన్నారు. హాజీపూర్ మండలం రాపల్లిలో 6 కోట్ల రూపాయలతో మరో శిక్షణ కేంద్రం, మంచిర్యాలలో ఐటి పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. యువత ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని స్వయంకృషితో ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఐటిఐ ప్రిన్సిపల్ రమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## పరిశుభ్రతపై కాగజ్‌నగర్‌లో 2కె రన్

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా కాగజ్ నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం 2కె రన్ నిర్వహించారు. పట్టణంలోని తెలంగాణ చౌరస్తా నుండి ప్రారంభమైన ఈ రన్ రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు ఉత్సాహంగా కొనసాగింది. అనంతరం గాంధీ పార్కులో పేరుకుపోయిన చెత్తను శాస్త్రీయంగా వినియోగించి కంపోస్ట్ ఎరువు తయారీ చేసే విధానాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ కొత్తపల్లి అనిత, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎమ్మాజీ శారద, జ్యోతి, విజయ్ కుమార్, వాసిమున్నిస, మాణిక్యారావుతో పాటు ఆర్‌పిలు, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యం, అధికారుల సమష్టి కృషితో పెంబి ప్రగతి సాధ్యం

కలెక్టర్ అభిలాష అభినవ్




**ప్రజాపక్షం/నిర్మల్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం వేదికగా,సోమవారం జరిగిన నీతి అయోగ్ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్ లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నీతి అయోగ్ ఆస్పిరేషన్ బ్లాకు కార్యక్రమం కింద పెంబి మండలంలో చేపట్టిన ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి,తదితర మౌళిక సదుపాయాల కల్పనలో చేసిన కృషి, తద్వారా సాధించిన ప్రగతి వివరాలు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.పెంబి అభివృద్ధిలో ఎదురైన సవాళ్లు,చేపట్టిన చర్యలు సెమినార్‌లో వెల్లడించారు. ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి,మహిళలు,గర్భిణుల్లో రక్త హీనత, పోషకాహార లోపాల నివారణ,రోగాల నిర్ధారణ, నివారణ, భూసార పరీక్షల నిర్వహణ,అక్షరాస్యత,విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపు,మౌళిక సదుపాయాల మెరుగు, తదితర అంశాల్లో అద్భుత ప్రగతి సాధించినట్లు కలెక్టర్ వివరించారు. స్థానిక ప్రజల భాగస్వామ్యం,అధికారుల సమష్టి కృషివల్ల పెంబి బ్లాకు ఆస్పిరేషన్ నుంచి ఇన్స్పిరేషన్‌గా పయనించిందని సంతోషం వ్యక్తం చేశారు. కాగా పెంబి బ్లాకులో చేపట్టిన కార్యక్రమాలకు గాను, నీతి అయోగ్ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్ కు నిర్మల్ జిల్లా ఎంపికయ్యింది. తెలంగాణ నుంచి కేవలం రెండు జిల్లాలు మాత్రమే ఎంపికవ్వడం మన జిల్లాకు గర్వకారణం.పెంబి బ్లాకు విజయ ఖ్యాతి మరోసారి చాటిచెప్పేందుకు ఈ నీతి అయోగ్ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్ వేదికయ్యింది.పెంబి బ్లాక్ అభివృద్ధిలో పాలుపంచుకున్న అధికారులకు,ప్రజలకు మరొకసారి కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు.



## గజ్వేల్ పార్కికుంటకు హద్దులు ఏర్పాటు చేయాలి

కలెక్టర్ హైమావతికి వినతిపత్రం అందజేత

**ప్రజాపక్షం/గజ్వేల్ :** గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లి రోడ్డు పక్కన గల పార్కికుంటకు హద్దులు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత జంగం రమేష్ గౌడ్ సోమవారం జిల్లా కలెక్టర్ హైమావతికి వినతి పత్రం అందజేశారు. సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆయన తన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కలెక్టర్ సానుకూలంగా స్పందించి, అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ మాట్లాడుతూ పార్కికుంట ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని, వెంటనే సరిహద్దులు గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. పార్కికుంట సుందరీకరణ చేపట్టాలని కోరగా, కలెక్టర్ ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.



## విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ప్రజాపక్షం/ఉట్నూర్ :** విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని ఏటీసీలో నిర్వహించిన విద్యార్థుల ఇంటరాక్షన్ ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు నూతన కోర్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే, విద్యార్థులు సిద్ధం చేసిన అసైన్‌మెంట్లను పరిశీలించి వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులకు త్వరగా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ఏటీసీలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఒక్కరు తమకు నచ్చిన రంగంలో నైపుణ్యం సాధించి ఉపాధి పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్కారం జెడ్పి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణి చేశారు.



## సమస్యలు పరిష్కరించకుంటే సింగరేణి వ్యాప్తంగా సమ్మె

ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ

**ప్రజాపక్షం/మందమర్రి :** సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా సమ్మెకు సిద్ధమని ఆ సంఘం మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం మందమర్రి ఏరియా పరిధిలోని కెకె 5 గని వద్ద కార్మికులను కలిసి ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రిల్ రాడ్స్ వంటి పనిముట్ల కొరతను తీర్చాలని, కొత్త బొగ్గు బ్లాకులను వెంటనే ప్రారంభించాలని, మెడికల్ బోర్డు ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేసి వారసులకు ఉద్యోగాలివ్వాలని, సొంతింటి పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం నుండి సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేస్తూ, ఈ నెల 19 నుండి సింగరేణి వ్యాప్తంగా జాతా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమనాదుని సుదర్శన్, కంది శ్రీనివాస్, సోమిశెట్టి రాజేశం, బాణయ్య, తిరుపతి, ఇగ్గేటి రాజేశ్వరరావు, సంపత్ కుమార్, ప్రభాకర్ శర్మ, మర్రి కుమార్, సంజీవ్ కుమార్, కల్వల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన ఆటలాడి భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** క్రీడా పోటీలలో మెరుగైన ఆటలాడి భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. అవార్డు గ్రహీత అనిల్‌కుమార్‌ను కలెక్టర్ సన్మాంచి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని దేశానికి బంగారు పతకాన్ని అందించడం గర్వించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో దేశానికి మరిన్ని పతకాలు అందించాలని కోరారు. అంతర్జాతీయ పోటీలకు క్రీడాకారులనందించిన జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘానికి అభినందనలు తెలిపారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 4 వరకు మలేసియాలో జరిగిన ఇండియా, మలేసియా అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ సిరీస్‌లో పాల్గొని దేశానికి బంగారు పతకం సాధించి జిల్లాకు విచ్చేసిన క్రీడాకారుడు రాసరి అనిల్‌కుమార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి పవన్‌కుమార్, జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘబాధ్యులు, అధ్యక్షులు గడ్డం శ్రావణ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్యామ్, ఉపాధ్యక్షులు రాజేష్, రమణ, కోశాధికారి రాజేశ్వర్, కృష్ణమూర్తి, సీనియర్ క్రీడాకారులు శశిధర్, ఆనంద్, కృష్ణ పాల్గొన్నారు.


## కెజిబివి ఉపాధ్యాయుల నిరసన



ప్రజాపక్షం/బూర్గంపాడు : బూర్గంపాడు కెజిబివి పాఠశాలలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమగ్ర శిక్ష, కెజిబివి, యుఆర్ఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా టిఎస్‌యుటిఎఫ్ జిల్లా నాయకుడు ఎం సత్యనారాయణ మాట్లాడుతూ సమగ్ర శిక్షలో రెండు దశాబ్దాలుగా పని చేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎస్‌వోలను ప్రిన్సిపాల్‌లుగా, పిజిసిఆర్‌టిలను జూనియర్ లెక్చరర్లుగా, సిఆర్‌టి, పిఇటిలను స్కూల్ అసిస్టెంట్లుగా పరిగణించి కనీస మూల వేతనం చెల్లించాలని, నిలుపుదల చేసిన వేతనాలను విడుదల చేయాలని, హెల్త్ కార్డులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కెజిబివి పాఠశాలలో కేర్, నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని కోరారు. ఈనెల 16న జిల్లా కేంద్రంలో జరిగే ధర్నా కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు బి బాలు, సహాధ్యక్షుడు టి రమేష్, సహాయ కార్యదర్శి ఎస్ జనార్ధన్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుశీల, సిబ్బంది పరమేశ్వరి, దివ్య చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుమట్లలోనే పేదలకు ఇండ్లు ఇవ్వాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతి



ప్రజాపక్షం/ఖమ్మం : వెలుగుమట్ల ప్రాంతంలో పేదల ఇండ్లు తొలగించిన చోటనే నివాస స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. గత నెల 24న వేలాది మంది పోలీసులు పేదల ఇండ్లను అతి దారుణంగా కూల్చివేశారని దీనితో వేలాది కుటుంబాలు వీధినపడ్డాయని వారు తెలిపారు. జీవనాధారమైన వస్తువులను కోల్పోయారని నాయకులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వెలుగుమట్లలోని భూదాన్ ప్రభుత్వ భూముల్లోనే ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, వంద గజాల చొప్పున కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా బాధ్యులు తాటి వెంకటేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు, పగిళ్ల వీరభద్రం, బి. బాబు, గోగుల ఆదినారాయణ, వాసిరెడ్డి వరప్రసాద్, రైతు సంఘాల బాధ్యులు దొండపాటి రమేష్, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, నందిపాటి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌వికి 'రైతు పురస్కార్' అవార్డు



ప్రజాపక్షం/ఖమ్మం : ప్రముఖ అభ్యుదయ రైతు, సేంద్రియ రైతు ఉద్యమ నాయకుడు నల్లమల వెంకటేశ్వరరావు (ఎన్‌వి)కు ప్రొ॥ జయశంకర్ విశ్వ విద్యాలయం నుండి అభ్యుదయ రైతు అవార్డును అందజేశారు. మంత్రి సీతక్క చేతుల మీదుగా నల్లమల వెంకటేశ్వరరావు ఈ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ, ప్రొ॥ జయశంకర్ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మార్చి 8, 9 తేదీలలో మెగా రైతు మేళాను నిర్వహించారు. ఈ మేళాను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించగా, ఈ మేళాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో నూతన శాస్త్ర సాంకేతిక రంగాన్ని వినియోగించడం, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడం, సేంద్రియ పద్ధతులను ప్రోత్సహించడం తదితర అంశాలపై మేళాలో చర్చించారు. రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో రైతులకు విశిష్ట సేవలు అందించిన నల్లమల వెంకటేశ్వరరావుతో పాటు అభ్యుదయ రైతులైన, ఖమ్మం జిల్లాకు చెందిన లక్ష్మి నారాయణ, భాస్కర్‌రావు, శ్రీవల్లికి కూడా అవార్డులు అందజేశారు.

## మొక్కజొన్నల కొనుగోలు కోసం వినతి



ప్రజాపక్షం/ఖమ్మం : మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటా రూ. 2,400 చొప్పున కొనుగోలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, బొంతు రాంబాబులు మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటా మొక్కజొన్నలు కేవలం రూ. 1,400 నుంచి రూ. 1,500కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని వారు తెలిపారు. రైతులు క్వింటాకు ఏడెనిమిది వందల రూపాయలు నష్టపోతున్నారని, పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రమేష్, రాంబాబులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, మాదినేని రమేష్, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, డెరంగుల లక్ష్మయ్య, అడపా కృష్ణయ్య, భూక్యా వీరభద్రం, రవికుమార్, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్‌కె ఖాసీం, పాశం అప్పారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సిండికేట్ 'చక్రబంధం'లో ఎక్సైజ్ శాఖ

వ్యాపారులు చెప్పిందే వేదం!
మద్యం ప్రియుల నడ్డివిరుస్తున్న బెల్ట్
బార్ అండ్ రెస్టారెంట్లలోను వీరబాదుడు

ప్రజాపక్షం/ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్సైజ్ శాఖ మద్యం వ్యాపారుల సిండికేట్ చక్రబంధంలో చిక్కుకుని చేష్టలుడిగి ఏమి జరుగుతున్నా చూస్తుండిపోతుంది. మద్యం విక్రయాలు ఎలా జరుగుతున్నా పట్టించుకునే స్థితిలో ఆ శాఖ లేదు. ఎక్సైజ్ శాఖ తీరుపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఉలుకూ పలుకు లేదు. మద్యం వ్యాపారులు చెప్పింది చేయడం తప్ప ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేయడం లేదన్న ఆరోపణలను ఎక్సైజ్ శాఖ ఎదుర్కొంటోంది. ఒకరిద్దరు కాదు ఎక్సైజ్ శాఖలో క్షేత్ర స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఇదే తీరు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ శాఖను గురించి పట్టించుకోవడం మానేశారు. మద్యం దుకాణాల్లో విక్రయించే మద్యం కంటే అనేక రెట్లు ఎక్కువ మద్యాన్ని బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్నారు. మద్యం దుకాణాల నిర్వహణలో కొంత మంది మద్యం వ్యాపారులు ఉండగా మరి కొందరు ప్రత్యేక వాహనాల్లో మద్యాన్ని సరఫరా చేస్తూ లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. మద్యం దుకాణాల్లో విక్రయిస్తే ఎంఆర్‌పికి విక్రయించాలి.

అదే బెల్ట్‌షాపులకైతే ఎంఆర్‌పిపై రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా విక్రయించవచ్చు. కామేపల్లి మండలంలో మద్యం దుకాణ యజమానులు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి గల్లీ గల్లీకి మద్యాన్ని అందిస్తున్నారు. జిల్లాలో అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి. బెల్ట్‌షాపుల యజమానులు మద్యం దుకాణాలవారు విక్రయించిన దానిపై మరో రూ.20 నుంచి రూ.30 అదనంగా వేసి మద్యం ప్రియులను పిండేస్తున్నారు. బెల్ట్‌షాపుల నిర్వహణకు సంబంధించి సమాచారం ఎక్సైజ్ యంత్రాంగానికి తెలుసు.

అప్పుడప్పుడు నామమాత్రపు దాడులను నిర్వహిస్తారు. ఉమ్మడిజిల్లాలో ఏ గ్రామంలో ఎక్కడ బెల్ట్‌షాపు ఉందో తెలిసి కూడా చూస్తుండిపోతున్నారు. అప్పుడప్పుడు మేము వస్తున్నామంటూ సమాచారం ఇచ్చి దాడులకు వెళ్తారు. ఏమి దొరకలేదని ఓ నిట్టూర్పుతో బయటకు వచ్చి మిగతా తతంగాన్ని పూర్తి చేస్తారు. ఎక్సైజ్ శాఖ మొత్తం సిండికేట్ గుప్పెట్లోనే నడుస్తుంది. సిండికేట్‌లో ఉన్న మద్యం వ్యాపారులు మొత్తం ఎక్సైజ్ శాఖను తమ నియంత్రణలోకి తెచ్చుకుని ఇష్టానుసారం గా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యాన్ని బయటకు విక్రయించకూడదు కానీ యథేచ్ఛగా విక్రయాలు జరుపుతున్నారు. ఇక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో ప్రొహిబిషన్‌ను పూర్తిగా మరిచిపోయారు. ఖమ్మం నడిబొడ్డున నాటుసారా విక్రయాలు జరుగుతున్నా ఆ శాఖ పట్టించుకునే స్థితిలో లేదు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయాలి. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి అధికారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తే మద్యం వ్యాపారులకు సహకరిస్తున్న తీరు బట్టబయలవుతుంది. సిండికేట్ మాటున జరుగుతున్న అక్రమాలకు ఏఏ అధికారులు వత్తాసు పలుకుతున్నారో కూడా అవగతమవుతుంది.

## బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పివి టీకా

ఎమ్మెల్యే రాగమయి



ప్రజాపక్షం/సత్తుపల్లి : బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పివి టీకా(హ్యూమన్ పాపిలోమా వైరస్) ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, ఈ టీకాతో బాలికలు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్. పట్టణంలోని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి, మండల పరిధిలోని గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్‌పివి వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార కేన్సర్ నివారణ కోసం 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పివి టీకా ఇవ్వడానికి తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్వయంగా బాలికలకు టీకా వేశారు. హెచ్‌పివి టీకా సింగిల్ డోస్‌గా ఒక్కరికి 0.5 మి.లీ మోతాదులో ఇస్తారని తెలిపారు. ప్రతి టీకా డోస్‌కు పూర్తి బాధ్యత ఉండాలని, టీకా వృథా కాకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టీకా వేయించే ముందు బాలికలు ఖాళీ కడుపుతో ఉండకూడదని, వయస్సును ఫోటో ఐడీ ద్వారా నిర్ధారించాలని తెలిపారు. అలాగే యూవిన్ పోర్టల్‌లో ఓటీపీ కోసం తల్లిదండ్రులు లేదా సంరక్షకుల మొబైల్ నంబర్ అందుబాటులో ఉండాలని సూచించారు. ఇప్పటికే టీకా తీసుకున్న బాలికల వివరాలను యూవిన్‌లో నమోదు చేయాలని తెలిపారు. టీకా అనంతరం బాలికలను కనీసం 30 నిమిషాలు పరిశీలనలో ఉంచడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ ఛైర్మన్ మహమ్మద్ రెహానా కమల్ పాషా, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బొంతు సుమలత వేణు, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో సింథటిక్ ట్రాక్ నిర్మాణం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం సర్దార్ పటేల్ మైదానం కొత్త రూపు సంతరించుకోనుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృషితో క్రీడాకారులకు మెరుగైన వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పటేల్ మైదానంలో రూ. 8.50 కోట్లతో సింథటిక్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. ఈ ట్రాక్ నిర్మాణం పూర్తయితే అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలను సైతం నిర్వహించే అవకాశం ఉంటుంది. క్రీడా రంగంలో ఖమ్మం జిల్లాను అగ్ర స్థానంలో నిలిపేందుకు మైదానంలో క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టిసారించి నిధులను మంజూరు చేయించారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ అందేలా చర్యలు చేపట్టారు. సిఎంకప్ 2024 పోటీల్లో రాష్ట్ర స్థాయిలో అథ్లెటిక్స్ విభాగంలో ఖమ్మంజిల్లాకు చెందిన క్రీడాకారులు 12 పతకాలు సాధించారు. ఇప్పుడు సింథటిక్ ట్రాక్ అందుబాటులోకి వస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన జిల్లా క్రీడాకారులు రాణించే అవకాశాలు ఉన్నాయి. మరో 10 రోజుల్లో సింథటిక్ ట్రక్ నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి పట్ల క్రీడాకారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

నలుగురు విద్యార్థినిలకు అస్వస్థత
వంద పడకల ఆసుపత్రికి తరలింపు



ప్రజాపక్షం/మణుగూరు : మణుగూరు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బా పూలే గురుకుల పాఠశాలలో నలుగురు విద్యార్థినిలు ఆదివారం రాత్రి తిన్న భోజనం వికటించి అస్వస్థకు గురయ్యారు. రోజు లాగానే రాత్రిపూట భోజనం చేసిన విద్యార్థినిలు తెల్లవారుజాము నుండే వాంతులు చేసుకోవడంతో గుర్తించిన గురుకుల పాఠశాల సిబ్బంది హుటాహుటిన స్థానిక 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స నిమిత్తం చేర్పించి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు వెల్లడించారు.

**మెరుగైన వైద్యంఅందించాలి: ఎమ్మెల్యే పాయం**

విషయం తెలుసుకున్న పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆసుపత్రికి చేరుకొని చిన్నారులను పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అలాగే మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు, మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గురజాల గోపి, అక్షర మహిళా మండలి సభ్యులతో కలిసి చిన్నారుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గురుకుల పాఠశాల వార్డెన్, పాఠశాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## 'అరసం' సంయుక్త కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/ ఖమ్మం : అభ్యుదయ రచయితల సంఘం(అరసం) మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల సంయుక్త కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షులుగా కొంపల్లి రామయ్య, ప్రధాన కార్యదర్శిగా అంగోతు జయవాసు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా తోటపల్లి సృజన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సూరం ఉపేందర్‌రెడ్డి, వెంకటలక్ష్మి, రాజేందర్, సాధన, సుశీల, శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా యాకస్వామి, మోదుగు గోవింద్, కోశాధికారిగా కొత్తపల్లి కృష్ణారావును ఎన్నుకున్నారు. రానున్న కాలంలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో సమాజ చైతన్యానికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు.

**మహిళా రచయిత్రులకు సన్మానం..**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో పలువురు అభ్యుదయ మహిళా రచయితలకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరసం, రాష్ట్ర అధ్యక్షులు పల్లెరు వీరస్వామి లు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనించి ప్రజా చైతన్యానికి విరివిగా రచనలు రావాల్సిన అవసరం ఉందన్నారు. అరసం , రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కెవిఎల్ మాట్లాడుతూ సోషలిస్టు సమాజ నిర్మాణానికి అభ్యుదయ రచయితలు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధం మేఘాలు కమ్ముకున్న వేళ సమాజంలో శాంతిని పెంపొందించేలా రచయితలు తమ కలం ఎత్తాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షులు సాధనాల వెంకటస్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, సీతామహలక్ష్మి , గాజుల భారతి, విక్టోరియా, కాళంగి వసంత తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎఐటియుసి నాయకుల వినతి



ప్రజాపక్షం/సత్తుపల్లి : మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా నెలకు రూ.10 వేల వేతనంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా గౌరవ అధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ కె. శ్రీనివాసరెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నిమ్మటూరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. 2026 బడ్జెట్‌లో ఇందుకు అవసరమైన నిధులను కేటాయించి వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎఐటియుసి ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు తాళ్లూరు లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెపొంగు మల్లేష్ మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే మెనూ చార్జీలు పెంచడంతో పాటు కార్మికులకు ఇఎస్‌ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ రహిమున్నీసా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహాదేవ లక్ష్మి , జిల్లా కమిటీ సభ్యురాలు జక్కంపూడి వెంకటలక్ష్మి , సీతమ్మ, పూచి రమణ, వెంకటమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ అందించాలి

14 వరకు గ్లకోమాపై అవగాహన కార్యక్రమాలు
హెచ్‌పివి టీకాపై అదనపు కలెక్టర్ సూచనలు




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అర్హులైన బాలికలకు పూర్తి స్థాయిలో హెచ్‌పివి వ్యాక్సినేషన్ అందించాలని అదనపు జిల్లా కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమంపై జిల్లా అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మంజిల్లా ఆసుపత్రిలో మహిళా దినోత్సవం సందర్భంగా హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించడం జరిగిందన్నారు. 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 15వ సంవత్సరాల వరకు వయస్సు ఉన్న బాలికలకు హెచ్‌పివి టీకా అందించడం ద్వారా గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ను కట్టడి చేసే అవకాశం ఉందన్నారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పిహెచ్‌సిలు నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కల్లూరు, మధిర, సత్తుపల్లి, వైరా ఏరియా ఆసుపత్రిలో ప్రతి రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యాక్సినేషన్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న బాలికల్లో 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 15వ సంవత్సరంలోకి వస్తున్న ఆడపిల్లలందరూ వారి తల్లిదండ్రులతో ఏదైనా పిహెచ్‌సి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వెళ్లి తప్పనిసరిగా హెచ్‌పివి వ్యాక్సినేషన్ తీసుకునేలా మండల విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాలికల తల్లిదండ్రుల ఆమోదంతో హెచ్‌పివి టీకా వేస్తామని జిల్లావ్యాప్తంగా 11,460 మంది బాలికలు ఉండవచ్చునని అంచనా ఉందని వీరందరికీ వ్యాక్సిన్ అందించాలని తెలిపారు. మార్చి 14 వరకు గ్లకోమా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటిపై ఎటువంటి ఒత్తిడి ఉన్నా పరిశీలించి అవసరమైన చికిత్స తీసుకోవాలన్నారు. గ్లకోమాపై ప్రజలకు అవగాహన కల్పించేవిధంగా అవసరమైన ఐఇసి మెటీరియల్ తయారు చేసి గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలకు అందించాలని అదనపు కలెక్టర్ డిఎంఅండ్‌హెచ్‌ఒను ఆదేశించారు.ఈ సమావేశంలో డిఆర్‌ఒ ఎ. పద్మశ్రీ, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ రామారావు,జిల్లా అధికారులు , కలెక్టరేట్ ఎఒ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కస్నాతండాలో ఇసుక తోడేళ్లు

ఆకేరు నుంచి అక్రమంగా ఇసుక తరలింపు



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలం కస్నాతండా గ్రామంలో ఇసుక తోడేళ్లు రెచ్చిపోతున్నాయి. అక్కడి ఆకేరులో నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారు. రెవెన్యూ నుంచి జీపీఓ ఉన్నప్పటికీ ఇంతలా అడ్డగోలు వ్యవహారం కొనసాగుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇసుకాసరులు అక్రమంగా ఇసుకను తవ్వి ట్రాక్టర్ ట్రక్కుకు రూ.4 వేల చొప్పున అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆ ఇసుకను గ్రామాలలో ఇండ్లు, కట్టుబడి నిర్మాణాలకై అమ్ముతున్నట్లు తెలిసింది. ఇలా ఇసుకను తోడుతుండటంతో భూగర్భజల వనరుల తగ్గి నీటి ఎద్దడి సమస్యతో బావులు ఎండిపోత్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. రాబోయేది అసలే ఎండాకాలమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టింపులేని తీరుపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు సమస్యను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై జీపీఓ కవితను వివరణ కోరగా...ఇసుక తరలింపు విషయం నా దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు శ్రీనివాసరెడ్డి, లింగయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

